www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 10 సెప్టెంబర్ 2023
5
చిత్తూరు

బాబు అరెస్ట్‌లో రాజకీయ ప్రమేయం లేదు

ఎమ్మెల్యే వెంకటేష్ గౌడ

ప్రజాశక్తి- పలమనేరు: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌పై సీఐడీ దాదాపు రెండేళ్ళు విచారణ జరిపిందని, రూ.371 కోట్ల అవినీతిలో చంద్రబాబు పాత్రపై స్పష్టమైన ఆధారాలున్నాయి కాబట్టే అరెస్ట్ చేసిందని పలమనేరు ఎమ్మెల్యే ఎన్.వెంకటేష్ గౌడ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో రాజకీయ ప్రమేయం లేదని సిఐడి అడిగిన ప్రశ్నలకి బాబు సమాధానం ఇవ్వాలన్నారు, ఆ తర్వాత ఏం చేయాలన్నది న్యాయస్థానం తేలుస్తుందని తెలిపారు.

చంద్రబాబు అక్రమ అరెస్టుపై

తెలుగు తమ్ముళ్ల నిరసనలు

- జిల్లా వ్యాప్తంగా అరెస్టులు, గృహనిర్బంధాలు
- కుప్పంలో ఉద్రిక్త వాతావరణం

శనివారం తెల్లవారుజామున సిఐడి పోలీసులు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడంపై జిల్లాలో తెలుగు తమ్ముళ్లు ఒక్కసారిగా నిరసనలకు దిగారు. బాబుది అక్రమ అరెస్ట్ అంటూ ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టారు. పోలీసులు సైతం శాంతిభద్రతల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఇందులో భాగంగా పలువురు టిడిపి నాయకులను హౌస్‌అరెస్ట్ చేయడంతో పాటు మరికొందరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి తమ ఆధీనంలో ఉంచుకున్నారు. చాలాచోట్ల దిష్టిబొమ్మ దగ్ధంతో పాటు నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలిపారు.

ప్రజాశక్తి- పలమనేరు : పలమనేరు తెలుగుదేశం పార్టీ నాయకుల ముందస్తు అరెస్టులపై పట్టణ సీఐ చంద్రశేఖర్ శనివారం వివరణ ఇచ్చారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సుమారు 56మంది టిడిపి నాయకులను ముందస్తుగా అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

చంద్రబాబు నాయుడు అరెస్ట్ నేపథ్యంలో మాజీ మంత్రి ఎన్. అమరనాథ్‌రెడ్డి సతీమణి రేణుకా రెడ్డిని పోలీసులు గహ నిర్బంధంలో ఉంచారు. పలమనేరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద చెన్నై – బెంగళూరు జాతీయ రహదారిపై బైటాయించి నల్లదుస్తులు, బ్యాడ్జిలు ధరించి టైర్ తగులబెట్టి నిరసన తెలియజేశారు. పోలీసులు బలవంతంగా నాయకులను స్టేషన్‌కు తరలించి సాయంత్రం వదిలి పెట్టారు.

వికోటలో పోలీసులు టిడిపి నేతల మధ్య తోపులాట

నగరి: చంద్రబాబు నాయుడును సిబి సీఐడీ అధికారులు అరెస్టు చేయడంతో నగరి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ ఆదేశాలు మేరకు టీడీపీ నాయకులు ఆందోళన కార్యక్రమాలను నిర్వహించే అవకాశం వుందని నగరి పోలీసులు స్థానిక టీడీపీ నాయకులను హౌస్ అరెస్టు చేశారు. కానీ కొంతమంది టీడీపీ నాయకులు నగరి బస్టాండ్, ఎన్‌టీఆర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. వీరిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఆర్టీసీ బస్సులు రాకపోకలు లేక పోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. తమిళనాడు బస్సులు కూడా సరిహద్దు వరకు వచ్చాయి. కాగా పోలీసులు హౌస్‌అరెస్టు చేసినవారిలో టీడీపీ నాయకులు నగరి మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, జ్యోతి నాయుడు ఉన్నారు.

మొదటి అవినీతి పరులు జగన్, పెద్దిరెడ్డిలే.. రామచంద్ర యాదవ్

పుంగనూరు: ఈరాష్ట్రంలో అత్యంత అవినీతిపరులు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలేనని, అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలంటే ఆంధ్రప్రదేశ్ సీఐడీ మొదట వారిద్దరిని అరెస్టు చేయాలని భారత చైతన్య యువజన పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ పేర్కొన్నారు రాజకీయ కక్ష సాధింపులకు వ్యవస్థలను, అధికారులను వాడుకోవడం బీసీవై పార్టీ ఖండిస్తుందని ఆయన శనివారం స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును బీసీవై పార్టీ ఖండిస్తోందన్నారు.

గంగవరం: చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడంతో పుంగనూరు– పలమనేరు జాతీయ రహదారిపై తెలుగు తమ్ముళ్లు బైఠాయించి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. వీరిని పోలీసులు అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం సాయంత్రం సొంత పూచీకత్తు కింద విడిచిపెట్టారు.

నగరిలో..

బంగారుపాళ్యం: భారత రాజ్యాంగంలో చీకటి రోజు అని టిడిపి మండల అధ్యక్షులు జయప్రకాశ్ నాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ నిరసన తెలిపారు. మాజీ సర్పంచులు కోక ప్రకాష్ నాయుడు, మురళి, జయచంద్ర నాయుడు, కోదండ యాదవ్, కమల్ రెడ్డి, జనార్థన్ గౌడ్, రాధాకృష్ణ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: న్యాయం కోసం పోరాడుతున్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను అరెస్టు చేయడం తప్పు అని గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ థామస్ అన్నారు. మాజీ మండల పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఇంచార్జ్ మోహన్ మురళితో కలిసి మండల కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు. అక్రమంగా అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌లో ఉంచిన టిడిపి కార్యకర్తలను వెంటనే విడిచిపెట్టాలని వెదురుకుప్పం ఎస్సై రమేష్ బాబుతో చర్చించారు.

బైరెడ్డిపల్లి: చంద్రబాబు నాయుడు అరెస్టుపై మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు చెక్‌పోస్టు కూడలిలో నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ చేశారు. టిడిపి మండలపార్టీ అధినేత కిషోర్ గౌడు, సుబ్రహ్మణ్యం శెట్టిలను ఏఎస్ఐ వెంకయ్య హౌస్ అరెస్ట్ చేశారు. రమేష్ రెడ్డి, సురేష్, కృష్ణమూర్తి, శంకరప్ప, ఎస్. సుబ్రహ్మణ్యంరెడ్డి, గోవింద్ స్వామి, రవిచంద్రగుప్తా ఉన్నారు.

ఎస్ఆర్‌పురం: చంద్రబాబు నాయుడు అరెస్ట్ చేయడంతో మండలంలోని పుల్లూరు క్రాస్‌రోడ్‌లో మండల పార్టీ అధ్యక్షులు గంధమనేని జయశంకర్ నాయుడు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు నిరసన తెలిపారు. గంధంనేని రాజశేఖర్ నాయుడు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

వికోట: స్కిల్ డెవలప్మెంట్ కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు శనివారం ఉదయం అరెస్ట్ అయిన విషయం తెలియడంతో వీకోట తెలుగుదేశం పార్టీ నేతలు అంబేద్కర్ కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వీకొట రూరల్ సీఐ లింగప్ప ఆధ్వర్యంలో ఎస్సై మనోహర్ పోలీసులు తెలుగుదేశం పార్టీ శ్రేణుల నిరసన కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. మండల నలుమూలల నుండి పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు వైయస్సార్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు.

శాంతిపురంలో..

రామకుప్పం: టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టు వైసిపి నీచరాజకీయ సంస్కృతికి నిదర్శనమని టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్ల నారాయణాచారి, మండల పార్టీ అధ్యక్షులు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంజనేయ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విశ్వనాథ్యం, వెంకటాచలం పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రామకుప్పంలో టిడిపి శ్రేణులు భారీ ఎత్తున రాస్తారోకో, నిరసన ర్యాలీ చేపట్టారు. ఆటో స్టాండ్ సర్కిల్లో సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దిష్టిబొమ్మను దహనం చేశారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ బల్ల గ్రామానికి చెందిన రజనీ అనే టీడీపీ కార్యకర్త శిరోముండనం చేయించుకొని నిరసన వ్యక్తం చేశారు.

శాంతిపురం: మండలంలో తెలుగుదేశం పార్టీ మండల నేతలు నిరసన వ్యక్తం చేస్తూ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. టిడిపి ప్రధాన కార్యదర్శి పివి నాగరాజ్, విజయరామ్ రెడ్డి, ఆర్ఎస్ మని, ఏఎంసి నాగరాజు, చంద్రశేఖర్, ఉయ్యాల జయరాంరెడ్డి, గోపాల్, రుద్రప్ప, బాలకష్ణ, బసవరాజు, జయరాజ్ పాల్గొన్నారు.

పెద్దపంజాణి: మండల టిడిపి అధ్యక్షులు ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయం ముందు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. రోజా కష్ణరెడ్డి, సుధాకర్ రెడ్డి, లింగాపురం సర్పంచ్ రుద్రమూర్తి నాయుడు, కష్ణారెడ్డి, శ్రీరాములు, స్థానిక నాయకులు కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

రామకుప్పంలో..

గుడిపల్లి: మండలంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమఅరెస్టుపై మండల తెలుగుదేశం నాయకులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. గుడిపల్లి క్రాస్‌లో వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వెంటనే చంద్రబాబును విడుదల చేయాలని నల్ల బ్యాడ్జీలతో శాంతియుతంగా నిరసన తెలిపారు.

కార్వేటినగరం : చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ జీడీ నెల్లూరు టిడిపి ఇన్చార్జి డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో కార్వేటినగరం గాండ్లమిట్ట కుడలి వద్ద తెలుగు తమ్ముళ్లు నిరసన తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు చెంగల్రాయల్ యాదవ్‌ను ఇంటి వద్ద అరెస్ట్ చేశారు. మాజీ ఎంపీపీ జనార్థన్‌రాజు, ప్రధాన కార్యదర్శి రాజేంద్రరెడ్డి, బీగాల రమేష్, సోమశేఖర్ యాదవ్, ధనంజయ వర్మ, పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: మాజీ సీఎం చంద్రబాబు నాయుడుని అరెస్టు చేయడంతో మండల కేంద్రంలోని నెల్లేపల్లె మిట్ట, సిద్దేశ్వరకొండలో టీడీపీ కార్యకర్తలు, నేతలు ధర్నా చేపట్టారు. ఎస్ఐ ఉమా మహేశ్వరరావుతో పాటు టిడిపి నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షులు స్వామిదాస్‌లను హౌస్‌అరెస్ట్ చేశారు.

చంద్రబాబును అరెస్టు చేసిన తీరు దారుణం

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

చిత్తూరుఅర్బన్: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రాబాబు నాయుడును అర్థరాత్రి నంద్యాలలో ఆయన వసతిపై దాడిచేసి, భయబ్రాంతులకు గురిచేసి, తెల్లవారు జామున అరెస్టు చేయడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేత జిల్లాల పర్యటనలో భాగంగా నంద్యాలలో ఉన్నప్పుడు అరెస్టు చేసిన తీరు తీవ్ర అభ్యంతరకరమని, ఈఅరెస్టును సిపిఎం జిల్లాకమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని అన్నారు. చంద్రబాబును తక్షణమే విడిచిపెట్టి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన అవినీతి ఆరోపణలపై నిష్పక్షపాతంగా, చట్టబద్దంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు. చందద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆందోళనకు దిగిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను రాష్ట్రవ్యాపితంగా గృహ నిర్బంధం చేయడం, ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం, ఆయన కుమారుడు లోకేష్‌ను అనుమతించకపోవడం అప్రజాస్వామికమన్నారు. ఈ అరెస్టులను సిపిఎం జిల్లా కమిటీ ఖండిస్తున్నదని, అరెస్టు చేసినవారిని తక్షణమే విడుదల చేయాలని కోరారు.

అట్టుడికిన కుప్పం

- చంద్రన్న అరెస్టుపై తిరగబడ్డ తెలుగు తమ్ముళ్లు- కుప్పంలో ఉద్రిక్త వాతావరణం

కుప్పం: నారా చంద్రబాబు నాయుడును అరెస్ట్ చేయడంపై కుప్పం తెలుగు తమ్ముళ్లు ఒక్కసారిగా తిరగబడ్డారు. బాబు అరెస్ట్ అక్రమం అంటూ నిరసన కార్యక్రమాలను చేపట్టారు. పోలీసులు సైతం శాంతిభద్రతల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. ఇందులో భాగంగా పలువురు టిడిపి నాయకులను హౌస్‌అరెస్ట్ చేయడంతో పాటు మరికొందరిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి తమ ఆధీనంలో ఉంచుకున్నారు. ఈ క్రమంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లు కుప్పం పోలీస్‌స్టేషన్ నందు బైఠాయించి అధికార పార్టీకి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. అలాగే బాబు అరెస్టుకు వ్యతిరేకంగా కుప్పం బంద్‌కు పిలుపునిచ్చారు. టిడిపి నాయకుల పిలుపుతో స్థానిక ప్రజలు సైతం స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి బందుకు సహకరించారు. తిరగబడ్డ తెలుగు తమ్ముళ్లు క్రిష్ణగిరి– పలమనేరు జాతీయ రహదారిపై టైర్లను కాల్చడం, పెద్దపెద్ద చెట్లను నరికి రోడ్లకు అడ్డంగా వేయడం వలన వాహన రాకపోకలకు ఇబ్బంది ఏర్పడి ప్రయాణికులు అవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు రోడ్లపై ధర్నా నిర్వహిస్తున్న టిడిపి నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషనుకు తరలించారు. దీంతో పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులకు తెలుగు తమ్ముళ్లకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా మాటా మాటా పెరిగి ఆగ్రహానికి గురైన టిడిపి శ్రేణులు ఒక్కసారిగా స్టేషన్‌గేట్లను తోసుకుంటూ రోడ్డు పైకి రావడం జరిగింది. వీరిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా టిడిపి శ్రేణులకు పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. దాంతో చేసేది లేక పోలీసులు చేతులెత్తేశారు. దీంతో టిడిపి శ్రేణులు మళ్లీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

కుప్పంలో..

సీజనల్ వ్యాధులపై సమరం

- ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన
- క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించి, రోగాల భారిన పడకుండా ఉండేందుకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై నగరపాలక సంస్థ క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమనికి శ్రీకారం చుట్టింది. ప్రణాళికాబద్ధంగా దోమల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నగరంలోని అన్ని డివిజన్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈనెల 8 నుండి 16వ తేదీ వరకు చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9 రోజుల పాటు పారిశుధ్య కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. ముఖ్యంగా సీజనల్‌లో వ్యాపించే డెంగీ, మలేరియ, టైఫాయిడ్ వంటి వ్యాధులను నివారించేలా క్షేత్రస్థాయిలో పారిశుధ్య కార్యక్రమాల ద్వారా దోమల నివారణా చర్యలకు నగర పాలక సంస్థ శ్రీకారం చుట్టింది.

ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న ఎంఎల్ఏ

ఈనెల 8వతేది చిత్తూరు కార్పొరేషన్ పరిధిలోని 39వ డివిజన్‌లో ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు, నగర మేయర్ అముద, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అరుణ, హెల్త్‌ఆఫీసర్ లోకేష్‌లు ప్రత్యేక కార్యక్రమాలను ప్రారంభించారు. సీజన్ వ్యాధులు ప్రభలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు కరపత్రాలు ద్వారా అవగాహన కల్పించారు. ప్రతిరోజూ ఉదయం నుండీ సాయంత్రం వరకు నిర్ధేశించిన వార్డులో పారిశుధ్య కార్మికులు మురుగునీటి కాలువలు శుభ్రం చేయడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజల్లో అవగాహన కల్పించనున్నారు. ఇందు కోసం 40మంది పారిశుధ్య కార్మికులను ప్రత్యకంగా కేటాయించారు. రోజువారీ కార్యక్రమాలను పర్యవేక్షించేందుకు 41మంది సూపర్‌వైజర్లను నియమించారు. గతేడాది డెంగీ కేసులు నమోదు అయిన ప్రాంతాలతో పాటు 72 హాట్‌స్పాట్ కేంద్రాలను నగరపాలక సంస్థ గుర్తించింది. ఈ ప్రాంతాల్లో పారిశుధ్య ప్రత్యేక చర్యలుగా సైఫ్రొతిన్ మందు పిచ్చికారి, ఆయిల్ బాల్స్ వేయడం, మురుగునీటి కాలువల్లో పూడికతీత, దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ వేయడం, బ్లీచింగ్ చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు. అలాగే ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజకు అవగాహన కల్పించనున్నారు, ప్రతి కుటుంబం తమ పరిసరాల్లో వర్షపునీరు నిల్వకుండా చూసుకోవడంతో పాటు పాతటైర్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ ఇతర వాటిల్లో వర్షను నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు నీటితొట్టెలను శుభ్రం చేసుకోవాలి. ఇంట్లోకి గాలీ, వెలుతూ ఉండేలా చూసుకోవాలి, దోమలు కుట్టుకుండా దోమతెరలను వాడటంతో పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఇంటి పరిసరాల్లో వర్షపు, మురికి నీరు ఉండకుంటా చూసుకోవాలని ప్రజల్లో నగరపాలక సంస్థ అవగాహన ఈనెల 8వ తేది నుండీ 16వ తేదీ వరకు అవగాహన కల్పించనుంది. నగరపాలక సంస్థ సీజనల్ వ్యాధులు ప్రభలకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలకు ప్రజలు సహకారం అందించాలని మున్సిపల్ నగర కమిషనర్ డాక్టర్ అరుణ చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై

పోరాటాలకు సిద్ధంకండి

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి నరసింగరావు పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్రకార్యదర్శి నరసింగరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మికవ్యతిరేక విధానాలపై కార్మికవర్గం పోరాటాలకు సిద్ధం కావాలని శనివారం సీఐటీయూ కార్యాలయంలో రెండు రోజులు పాటు జరుగుతున్న జిల్లా వర్క్‌షాప్‌లో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి.నరసింగరావు పాల్గొని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇప్పటికే కార్మిక చట్టాలు మార్పు చేసి కార్మికవ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నదని విమర్శించారు. దీనికి తోడు కార్మికుల మధ్య చిచ్చుపెడుతూ మతం పేరుతో విభజన చేస్తున్నదని, దీనిని కార్మికవర్గం ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. కేంద్రప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేటీకరణ చేస్తూ ఆదాని, అంబానీ లాంటి బడా కార్పొరేట్ శక్తులకు అప్పగించడం దుర్మార్గమన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న స్కీం వర్కర్ల సమస్యను పరిష్కారం చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్ర ప్రభుత్వం బాటలో నడుస్తూ గతంలో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. అంగన్‌వాడీ, ఆశ, వీఓఏ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కారం చేయడంలోనూ అలాగే బిల్డింగ్, ఆటో, హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈసమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఐక్యపోరాటాలకు కార్మికవర్గం సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. ఈసమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.చైతన్య అధ్యక్షత వహించారు. ఈసమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, గిరిధర్ గుప్తా, షకీలా, సుజని, జ్యోతి, మధు, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమ్మ కొండ అభివృద్ధికి కృషి

జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

తాగునీటి బోరును ప్రారంభిస్తున్న జడ్పీ చైర్మన్

ప్రజాశక్తి- వికోట: మండల పరిధిలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన కష్ణమ్మ కొండ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. జిల్లా పరిషత్ నిధులతో కష్ణమ్మ కొండకు నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి బోరును వారు శనివారం ప్రారంభించారు. శ్రావణమాసం చివరి శనివారాన్ని పురస్కరించుకుని గుమ్మరెడ్డిపల్లి గ్రామస్తులు ఘనంగా కొండపై రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారి ఉత్సవాలు నిర్వహించారు. స్వామి వారి ఉత్సవసేవలో చైర్మన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో కొండపైకి సిమెంట్ రోడ్డు నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం

ఒకటవ అదనపు జిల్లా జడ్జి రమేష్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం, సమన్యాయం పొందవచ్చు అని, రాజీ మార్గంలో తర్వరితగతిన కేసులు పరిష్కరించుకోవచ్చు అని ఒకటవ అదనపు జిల్లా జడ్జి రమేష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఏస్టేట్‌లో ఉన్న జిల్లా కోర్టులో ఇంచార్జి జిల్లా జడ్జి ఎస్.శ్రీదేవి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ కుమార్‌లతో కలసి జిల్లా న్యాయసేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం, సమాన న్యాయం ఉచితంగా పొందవచ్చునని తెలిపారు. లోక్‌అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కక్షదారుల కోర్టులచుట్టూ తిరిగే అవసరం ఉండదని, సమయం, డబ్బు ఆదావుతుందని కక్షదారులు స్నేహపూర్వకంగా కేసులు రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి డాక్టర్ ఐ.కరుణ కుమార్ మాట్లాడుతూ కేసులకు సంబంధించి కోర్టుకు ప్రత్యక్షంగా హాజరు కాలేని వారికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైయే అవకాశం సుప్రీంకోర్టు కక్షదారులకు కల్పించిందని ఈఅవకాశాన్ని కక్షలదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా 35 బెంచ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని (జిల్లా కోర్టు నందు 6 బెంచ్‌లు) ద్వారా సుమారుగా వివిధ రకాల 10 వేల కేసులు రాజీ చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. చిత్తూరు జిల్లాలో ఎక్కువ కేసులు రాజీ చేసి రాష్ట్రంలోనే జిల్లాను మొదటి స్థానంలో నింపడానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.

లోక్‌అదాలత్‌లో 430 కేసులు పరిష్కారం

నగరి: స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 430 కేసులను పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాలకష్ణ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ జాతీయ లోక్ అదాలత్‌లో టైటిల్ పార్టిషన్‌కు సంబంధిత 9 కేసులు, మున్సిపల్, ఎక్సైజ్, సీసీఐపీసీ, అడ్మిషన్‌కు సంబంధిత 53 కేసులు, సెకండ్ క్లాస్ కోర్టు అడ్మిషన్ కేసులు 319, బ్యాంకు సంబందిత కేసులు 49 చొప్పున 430 కేసులు పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. అలాగే రూ.66లక్షల 587లు రికవరీ అయ్యిందని తెలిపారు. సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నెల్సన్, ఏపీపీ రామశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మణివాసగం, న్యాయవాదులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 1286 కేసులు పరిష్కారం

పలమనేరు: పలమనేరు పట్టణంలో జాతీయ లోక్‌అదాలత్‌లో 1286 కేసులను శనివారం పరిష్కరించారు. ఇందులో భూతగాదా కేసులు 19, ఫ్యామిలీకి సంబంధించి 4, చెక్‌బౌన్స్ కేసులు 5, క్రిమినల్ కేసులు కాంపౌండ్ 1157, మెయింటెనెన్స్ కేసు 1, బిఎస్ఎన్ఎల్ కేసులు 46 మొత్తంరికవరీ అమౌంట్ రూ.3,99,78,752లు పరిష్కరించబడినదని తెలిపారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి పి. శ్రీనివాసరావు, రవి, పలమనేరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మీపతి, సీనియర్ న్యాయవాదులు, పోలీసు అధికారులు, బ్యాంకు మేనేజర్లు, బిఎస్ఎన్ఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కోర్టు సిబ్బంది, పలమనేరు పరిరక్షణ సమితిమెంబర్లు, కక్షిదారులు పాల్గొన్నారు.

విషజ్వరాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- కార్వేటినగరం: డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక విష జర్వాల పట్ల ప్రజలు అప్రమత్తతంగా ఉండాలని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. శనివారం మండల పరిధిలోని రాజులకండ్రిగ దళితవాడను సందర్శించి విషజ్వరాలపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి మాట్లాడుతూ విషజ్వరాల్లో ప్రమాదకరమైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి రోగాలపై అవగాహన కలిగి ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యసిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామవీధులను మిలాథిన్ చేసి పారిశుధ్యాన్ని మెరుగుచేశారు. కార్యక్రమంలో డాక్టర్ గోపినాధ్, డాక్టర్ యూసఫ్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్తులకు వ్యాధులపై సూచనలు ఇస్తున్న డాక్టర్ రవిరాజు

దళితులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

దళితులపైకేసులు ఎత్తివేయాలని నినాదాలుచేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: గుంటకిందపల్లి భూ వివాదం కేసులో దళితులపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తి వేయాలంటూ కార్మిక, దళిత, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో కార్మిక, దళిత, ప్రజా సంఘాల నాయకులు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటకిందపల్లిలో దళితులకు చెందిన భూమి అక్రమణపై అధికార పార్టీ నేతలకు వ్యతిరేకంగా పోరాడినందుకు జై భీమ్ ఆర్మీ వ్యవస్థాపకులు పులి శ్రీకాంత్ తో పాటు మరో ముగ్గురు దళితులపై హత్యాయత్నం కేసులు నమోదు చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. వెంటనే వారిపై అక్రమ కేసులు ఎత్తి వేసి, దళితుల భూములు వారికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చందమామల కోటయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య పాల్గొన్నారు.

వెంకటపతి నగర్ నిషేధిత జాబితా భూములకు పరిష్కారం: కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: నిరుపేద మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చాలని దిశగా రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత భూముల (22 శాతం) పరిష్కారం చూపిందని కలెక్టర్ కె వెంకటరమణా రెడ్డి అన్నారు. శనివారం చంద్రగిరి మండలంలోని వెడ్లపల్లె లో వెంకటపతి నగర్ లో ని నిషేధిత భూములకు (22 శాతం) శాశ్వత పరిష్కారానికి సంబంధించిన కార్యక్రమానికి తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తో కలిసి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుపేద మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చేలా రాష్ట్ర ప్రభుత్వం నిషేధిత భూములకు (22శాతం) పరిష్కారం చూపించిందన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, మోహిత్ రెడ్డి చొరవ అభినందనీయం అని అన్నారు. 22 శాతం భూములకు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కారం చూపడంతో విముక్తి లభించిందని అన్నారు. భూములు సాగు చేసుకుంటున్న పట్టా ఉన్నా అవసరానికి క్రయవిక్రయాలకు అవకాశం ఉండేది కాదని తెలిపారు. ఈ సమస్య పరిష్కార దిశగా రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు మంచి చేకూర్చాలనే దిశగా అడుగులు వేసి భూములకు విముక్తి కల్పించిందన్నారు. వెంకటపతి నగర్ కు సంబంధించి నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములకు శాశ్వత పరిష్కార దిశగా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రొసీడింగ్స్ ఇచ్చామన్నారు. ఇందుకు జాయింట్ కలెక్టర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. ఈ గ్రామానికి సంబంధించిన ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తా మన్నారు. జెసి మాట్లాడుతూ వెంకటపతి నగర్ కి సంబంధించిన భూ సమస్యను కలెక్టర్ పాజిటివ్ గా తీసుకొని పరిష్కారానికి ఎంతో కృషి చేశారని, 36 సంవత్సరాలుగా వున్నసమస్యకు వెంకటపతి నగర్ లోని భూములను రీ సర్వే చేయించి నిషేధిత జాబితా నుండి వారి భూములకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. గ్రామ సర్పంచి చిన్ని యాదవ్ ఎంతో కృషి చేశారని తెలిపారు . తుడా చైర్మన్ మాట్లాడుతూ 36 సంవత్స రాలుగా తీరని వారి సమస్యను నిషేధిత జాబితా లోని భూములకు శాశ్వత పరిష్కారం చూపించామన్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఈ గ్రామ భూమి ప్రభుత్వ భూమిగా ఉండటంవల్ల నిషేధిత భూముల జాబితాలో పెట్టారని, అందువల్ల ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ జరగలేదని తెలిపారు. ఇప్పుడు ఈ గ్రామ ప్రజలకు వారి భూములపై శాశ్వత హక్కు కల్పించి క్రయ విక్రయాలు మార్గం చూపించామన్నారు. ఈ గ్రామ సమస్య పరిష్కారానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారం చేసి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని కల్పించి శాశ్వత హక్కు కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం వెంకటపతి నగర్ భూములకు సంబంధించిన నిషేధిత జాబితా నుంచి తొలగించిన ప్రొసీడింగ్స్ ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, తుడా చైర్మన్ తో కలిసి జిల్లా రిజిస్ట్రార్ అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీఓ కనక నర్సారెడ్డి, తుడా సెక్రెటరీ లక్ష్మీ, తాసిల్దార్ సుబ్రహ్మణ్యం, గ్రామ సర్పంచి చిన్ని యాదవ్ జిల్లా రిజిస్ట్రార్ అధికారి శ్రీరామ్, సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్ననిర్వాహకులు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో నగదు బహుమతులను గెలుచుకున్నారు. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీల్లో కళాశాల విద్యార్థినులు విశేష ప్రతిభను కనబరిచి బహుమతులను సొంతం చేసుకున్నారు. విజేతలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె మహదేవమ్మ, కళాశాల కోకరికులర్ కోఆర్డినేటర్, తెలుగు విభాగాధిపతి డాక్టర్. వి. కృష్ణవేణి అభినందించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవంలో విద్యార్థినులు బహుమతులు స్వీకరించారు.

జాతీయ లోక్ అదాలతో 987 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోకాదాలలో 987 కేసులు పరిష్కరించి రూ.2,27, 86,435 మేర రాజీ చేసినట్లు పుత్తూరు మండల న్యాయ సేవా అధికారి సంస్థ అధ్యక్షులు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర తెలిపారు. సివిల్ కేసులు 44 కేసులు రూ 1.1986 మేర ఆస్తులు పరిష్కరించామని, 931 క్రిమినల్ కేసులు, రూ.870227 మేర ప్రీవిటి గేషన్ కేసులు12 పరిష్కరించామని జడ్జి తెలిపారు. రూ. 20,91,275 మేర ఆస్తి వివాదాల పరిష్కారానికి లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు రాఘవేంద్ర, సి జానకి, గోపాలకృష్ణ వ్యవహరించారు. పుత్తూరు న్యాయవాదులు సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించా మన్నారు. ఇంకా పెండింగ్‌లో వున్న కేసుల పరిష్కారానికి సమయం వృథా చేసుకోకుండా ఆదా చేసుకో వచ్చన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలతో వివిధ రకాల విన్యాసాలు చేశారు. మాదక ద్రవ్యా లు ఉపయోగిస్తే చట్టారీత్యా నేరమని, వివిధ రకాల శాఖల ద్వారా వైద్య శిబిరాలు, పౌష్టికాహారాలకు సంబంధించిన స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సంజీవి, కేజీ ప్రభాకర్, మండల విద్యాశాఖ అధికారి తిరుమల్ రాజు, బాలసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, కక్షిదారులు, బ్యాంకు అధికారులు, పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని గూడలి పంచాయతీ పరిధిలో ప్రకాశం కాలనీకి చెందిన కటికాల నారాయణ అనారోగ్యంతో ఉండడంతో మందులు ఖర్చు నిమిత్తం శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి నిర్వాహకులు అల్లం రమణయ్య చేతుల మీదుగా శనివారం 2వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా అల్లం రమణయ్య మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న కటికాల నారాయణకు ప్రతి నెల వెయ్యి రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఈ ఆర్థిక సాయంను నెల్లూరుకి చెందిన ఓరుగంటి సూర్య ప్రకాష్ రావు, శేషమ్మ కుమారులు ఓరుగంటి పనేంద్ర కుమార్ దాతృత్వంతో అందిస్తున్నామన్నారు. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఆగస్టులో ఇవ్వాల్సిన వెయ్యి రూపాయలు ఇవ్వలేక పోవడంతో శనివారం ఈ నెలలో ఇవ్వాల్సిన నగదు తో పాటు రెండు వేల రూపాయలను అందించామన్నారు. దీంతో ఆ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆవుల సుబ్బయ్య పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం ఉత్తరపు కండ్రిగ దళితవాడకు చెందిన పలువురు టిడిపి యువ నాయకులు పరుశురాం, ప్రకాష్ , సమక్షంలో వైసీపీ నుండి టిడిపిలో చేరారు. నగరి నియోజక వర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ చేతుల మీదుగా టిడిపి కండువాలు కప్పి ఆ పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన యువకులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ అభివృద్ధికి తామంతా కలిసికట్టుగా చేస్తామన్నారు. వారికి అభినందనలు తెలిపారు. ఆ పార్టీలో చేరిన వారిలో అనిల్ కుమార్, ప్రేమ్ కుమార్, మణి, సురేష్, వాసు, కరుణ, కిషోర్ వున్నారు.

పాఠశాలల తనిఖీ

ప్రజాశక్తి-తడ: మండల విద్యా శాఖాధికారి -2 మల్లిఖార్జున రావు మండ లం లోని ప్రాథమిక పాఠశాల లు వెండ్లురుపాడు, యన్. యమ్ కండ్రిగ లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద్భంగా పిల్లల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం మధ్యాహ్నం భోజనం ను పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలు, సలహాలు అందించారు. వీరితో పాటు సిఆర్‌పి మునస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులు విద్య విలువను తెలుసుకోవాలి

- ఆచార్య శ్యామ్‌మోహన్ డేవిడ్ రాజు

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థులు విద్య విలువ తెలుసుకొని తరగతి గదిలో పాఠాలను శ్రద్ధగా విని ఉన్నత లక్ష్యాల దిశగా రాణించాలని వయోజన విద్యా విభాగం ఆచార్యులు బి. శ్యావమ్‌మోహన్ డేవిడ్ రాజు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వయోజన విద్యా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం తిరుపతి రూరల్ మండల పరిధిలోని మల్లంగుంట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనూ, దేశంలోనూ విద్య ప్రాముఖ్యతను, అవసరాన్ని వివరించారు. విద్యార్థులు అక్షరాస్యులుగా ఉన్నత రంగాల్లో రాణించడం ద్వారా దేశ, రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తారన్నారు. వయోజన విద్యా విభాగాధిపతి ఆచార్య ఆర్ బి సత్యవతి మాట్లాడుతూ నేటి బాలలే రేటి పౌరులని, చదువుకున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులకు నిరక్షరాస్యులైన వారికి చదవడం, రాయడం, లెక్కలు చేయడం నేర్పించాలని సూచించారు. ప్రధానోపాధ్యా యురాలు భువనేశ్వరి దేవి మాట్లాడుతూ విద్య లేని వారు వింత పశువు అనే నానుడి నుంచి భారతదేశంలో అక్షరాస్యతలో 75 శాతంపైనే అభివృద్ధి సాధించారన్నారు. దేశంలో అక్షరాస్యతలో కేరళ మొదటి స్థానం వున్నట్లే మన రాష్ట్రం ప్రథమ స్థానంలోకి రావాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు వ్యాసరచన, మౌఖిక పరీక్షలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యా విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం సి ఓబులేసు, ఎం సుబ్రహ్మణ్యం, ఈ మహదేవరెడ్డి, పాఠశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితం.. అధ్యయనం పోరాటంగా సాగాలి

- ఎస్వీయూ ప్రొఫెసర్ పిసి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యార్థి తన జీవిత కాలంలో కేవలం విద్యాభ్యాసంతోనే సరిపెట్టుకోకుండా సమాజ అధ్యయనం, పోరాటాలతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ పిసి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం బైరాగి పెట్టడంలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో పిడిఎస్‌యు రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక తరగతులు ప్రారంభమయ్యాయి. ముందు రాష్ట్ర అధ్యక్షుడు ఈ భూషణం పిడిఎస్‌యు పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అనంతరం అమరులైన పిడిఎస్‌యు విద్యార్థి నాయకులకు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ పి సి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పైన, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పైన విద్యార్థి సంఘాలు చేస్తున్న పోరాటాలతో అనేక సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. నేడు పాలకులు కొన్ని పథకాలతో విద్యార్థుల ఖాతాల్లోకి డబ్బులు వేస్తున్నారని దీనివల్ల వారికి ఒరుగుతున్న ప్రయోజనం ఏమీ లేదన్నారు. పథకాల పేరులో స్కాలర్‌షిప్‌లు ఎత్తివేయడం వల్ల విద్యార్థులు అన్యాయానికి గురయ్యారన్నారు. ప్రస్తుతం సమాజంలో మార్పు కోసం పరితపిస్తున్న విద్యార్థి సంఘాలను నీరుగార్చేలా జరుగుతున్న తప్పుడు ప్రచారాలను విద్యార్థులు అర్థం చేసుకోవాలన్నారు. దేశంలో విద్యారంగ ప్రైవేటీకరణకు జరుగుతున్న కుట్రలను, పాలకులు చెబుతున్న మాయ మాటలను క్షుణ్ణంగా పరిశీలించి ముందడుగు వేయాలన్నారు. సనాతన ధర్మం పేరుతో సమాజంలో కొన్ని వర్గాలను అణచివేస్తున్న ధోరణిని ప్రశ్నిస్తే తట్టుకోలేకపోతున్నారని ఆయన వివరించారు. ప్రతి విద్యార్థి సమాజాన్ని నిశితంగా అధ్యయనం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే భాస్కర్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి హృదయ రాజు, తెలంగాణ రాష్ట్ర పిడిఎస్‌యు ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు

- తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ :దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మితమవుతుందని తుడ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రతి ఏటా కొత్త దుస్తులు, స్వీట్లు పంపిణీ చేసి శాలువలతో ఘనంగా సత్కరించడం ఆనవాయితీ.. ఇందులో భాగంగా ఈ ఏడాది ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గురువులందరినీ సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. తిరుపతి శ్రీవేంకటేశ్వ ర విశ్వవిద్యాలయంలోని శ్రీనివాస ఆడిటోరియం వేదికగా శనివారం చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థలు, అంగన్ వాడీ కేంద్రాలలో పనిచేసే 1800 మంది గురువులకు ఘనంగా సన్మానించారు. సుమారు మూడు గంటల పాటు నిలుచున్న తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఒక్కొక్క ఉపాధ్యాయున్ని ఆత్మీయంగా పలుకరిస్తూ శాలువతో సత్కరించి కొత్త దుస్తులు, స్వీట్లు చేతికిచ్చి వారి నుంచి ఆశీస్సులు స్వీకరించారు. గురువులను సత్కరించే బృహత్తరమైన కార్యక్రమానికి కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, తుడా కార్యదర్శి లక్ష్మీ, డీఈవో శేఖర్ లు విచ్చేశారు. ముందు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించిన తర్వాత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

ఎంత మేధావి అయినా గురువుకు శిష్యుడే : కలెక్టర్

ప్రపంచంలో ఎంత పెద్ద మేధావి అయినా ఒక గురువుకు శిష్యుడే అవుతాడని భావించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని గురువులను ప్రతిభతో సంబంధం లేకుండా అందరినీ ఒకేలా ఆత్మీయ సత్కారం అందించడం అభినందనీయమని కలెక్టర్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. గురువులను గౌరవించ డమంటే మంచి సమాజాన్ని నిర్మించుకోవడమే అవుతుం దన్నారు. గురువును మించిన వారు ఎవ్వరూ ఉండరని, ప్రేమతో పాఠాలు చెబితే సమాజానికి ఉపయోగపడే పిల్లలను తయారవుతారన్నారు. ఉపాధ్యాయులు కలకాలం గుర్తు పెట్టుకోవాలన్నారు. ఎంతో మంది గురువులు అందరినీ ఏకం చేసి ఒకే వేదికపైకి తెచ్చి ఘనంగా సత్కరించడం ఒక్క ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి మాత్రమే సాధ్యమవుతుందన్నారు. ఎక్కడ గురువులు పూజింపబడతారో అక్కడ అభివృద్ధి పరుగులు పెడు తుందన్న పెద్దల మాటను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలు నిరూ పించారన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి చేపట్టిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలు నుంచి వచ్చిన చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. గురువుల గొప్పతనాన్ని చాటిచెప్పేలా పాడిన పాటలు, దైవ భక్తిని పెంపొందించే నృత్య ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి.

గాజులమండ్యం అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికి హామీ

ప్రజాశక్తి -రేణిగుంట : గాజులమండ్యం అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం కోసం కార్యాచరణ రూపొందించామని వైసిపి మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్ర రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం ఆ ప్రాంతాన్ని తిరుపతి ఎంపీ గురుమూర్తి వైసీపీ మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్ర రెడ్డి పరిశీలించారు. గాజులమండ్యంలో విద్యార్థులు గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందంటూ విద్యార్థులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి తెలిపారు. తిరుపతి ఎంపీ గురుమూర్తితో కలిసి రేణిగుంట మండల ఇన్‌చార్జి పవిత్ర రెడ్డి గాజులమండ్యం అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం పనులు నిర్వహించేందుకు వీలుగా ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బియ్యపు పవిత్ర రెడ్డి మాట్లాడుతూ రేణిగుంట మండలంలోని గాజులమండ్యం గ్రామం నందు విద్యార్థులు తమ పాఠశాలలు వెళ్లడానికి గ్రామస్తులు అత్యవసర సమయంలో గ్రామం నుంచి వెళ్లడానికి అండర్ పాస్ బ్రిడ్జి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని త్వరలోనే అధికారులతో సంప్రదించి అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపడతామని ఎంపీ గురుమూర్తి, పవిత్ర రెడ్డి విద్యార్థులకు హామీ ఇచ్చారు. గాజులమండ్యం గ్రామస్తులు వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట మండల ఎంపిపి కలపాటి హరిప్రసాద్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు పన్నీరుకాల్వ శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ గంగారీ రమేష్, ఎంపీటీసీలు ధనంజయ రెడ్డి, వెంకట రమణ రెడ్డి,ఆనంద్ రావ్, దయాకర్ రెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, మోహన్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, భాస్కర్ యాదవ్, నారయ్య యాదవ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణం లో జరుగుతున్న అభివృద్ధి పనులను గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్ రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 75సంవత్సరాల నుండి జరగని అభివృద్ధి, నాలుగు న్నర సంవత్సరాల కాలంలో జరిగిందని చెప్పుకో వడానికి గర్వంగా ఉందన్నారు. గూడూరు మున్సిపాలిటీ లో ఎంతోమంది చైర్మన్ లు, ఛైర్ పర్సన్ లు అయినప్పటికీ, ఆ ప్రభుత్వాలు నిధులు కేటాయించకపోవడం తో, అభివృద్ధి కుంటు పడిందన్నారు. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత, గూడూరు పట్టణానికి కోట్ల రూపాయలు అభివృద్ధి పనులు కోసం కేటాయించడమే కాకుండా, 30సచివాలయాలకు గడప గడప కార్యక్రమం లో ప్రజల సమస్య ల పరిష్కారం కోసం దాదాపు 6కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కేటాయించారన్నారు. చేపల మార్కెట్, మాంసం మార్కెట్, కూరగాయలు మార్కెట్ నిర్మాణం చేపట్టి, అవి పూర్తయ్యే వరకు అహర్నిశలు పర్యవేక్షణ చేస్తున్నానన్నారు. అంతేకాకుండా గూడూరు హాస్పిటల్ రోడ్డు ను, పట్టణం లో సిమెంట్ రోడ్లు, దాదాపు 10చోట్ల పైగా, ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్లు నిర్మించామన్నారు. మార్కెట్ రోడ్డు నుండి ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టే వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. గూడూరు నియోజకవర్గం ప్రజల సౌకర్యం కోసం చిల్లకూరు జాతీయ రహదారి నుండి గూడూరు జగనన్న కాలనీ వరకు రింగ్ రోడ్డు నిర్మాణం కూడా త్వరలోనే ప్రారంభిస్తామని, ఎమ్ ఎస్ ఎమ్ ఈ పార్క్ కూడా ఏర్పాటు చేస్తున్నందుకు చాలా సంతోషం గా ఉందన్నారు. టీడీపీ వాళ్ల లాగా, విమర్శలు చేయకుండా అభివృద్ధి చేసి చూపుతున్నామన్నారు. ప్రభుత్వపథకాలు పొందే లబ్ధిదారులు, అవ్వా, తాతలు, అక్క చెల్లమ్మ లు, అందరూ ఒక్కసారి ఆలోచించి జగన్ మోహన్ రెడ్డి నే మళ్లీ ముఖ్యమంత్రి గా అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమం లో గూడూరు మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైసీపి పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, అన్నం మురళీ, జెసిఎస్ కన్వీనర్ రాఘవ రెడ్డి, జిల్లా అట్రాసిటీ మెంబర్ రమణయ్య, పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ అధ్యక్షులుగా సనత్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ నూతన అధ్యక్షులుగా సనత్ కుమార్ రెడ్డిని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. 2023- 24 సంవత్సరానికి ఇదివరకే నరసప్ప అధ్యక్షునిగా ఎన్నికైనప్పటికీ ఆయన అత్యవసరంగా విదేశాలకు వెళ్లడంతో ఆ స్థానంలో మరొక అధ్యక్షుని ఎన్నుకోవడం అని వార్యం కావడంతో కమిటీ సభ్యులు సనత్ కుమార్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రొటేరియన్ ఎల్లసిరి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఎప్పటిలాగే ప్రజలకు ఉపయోగపడే సామాజిక సేవా కార్యక్రమాలు నిర్విరామముగా కొనసాగించాలని ఆశాభవం వ్యక్తం చేస్తూ ,ఎన్నికైన నూతన అధ్యక్షులు ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. రొటేరియన్, మాజీ అధ్యక్షులు ధనంజయ రెడ్డి మాట్లాడుతూ రోటరీ జిల్లా లోనే గూడూరు వెస్ట్ క్లబ్ ప్రథమ స్థానంలో ఉన్నదని అదే ఒరవడి ఇకపై కొనసాగేలా కార్యక్రమాలు రూపకల్పన చేస్తామన్నారు. నూతన అధ్యక్షుడు సనత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ దాతలు , సభ్యుల సహకారంతో మంచి కార్యక్రమంలో రూపొందించుకొని నిరంతరం సామాజిక ప్రజాసేవకు ముందు ఉంటానని తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న కమిటీ సభ్యులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్ యాదవ్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సనత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్నామని మంచి కార్యక్రమాలతో రోటరీ వెస్ట్ క్లబ్ ముందుకు వెళ్లాలని ,తన వంతు సహాయ సహకారాలు క్లబ్ కు ఎప్పుడూ వుంటాయన్నారు.

సిసి రోడ్డునిర్మాణానికిభూమి పూజ చేస్తున్న వైసిపి నాయకులు

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి- నాయుడుపేట: నాయుడుపేట మండలం జువ్వలపాలెం పంచాయతీలోని మందబయిలు గ్రామంలోని వీధులకు 20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఆ పంచాయతీ సర్పంచ్ వెంకట రమణయ్య ఆధ్వర్యంలో నాయుడుపేట ఏఎంసీ ఛైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం ఈ పూజ నిర్వహించారు. ఆ గ్రామంలో 250 మీటర్ల పొడవునా నిర్మిస్తున్న ఈ సీసీ రోడ్లకి 20 లక్షల రూపాయలు వెచ్చించి నిర్మాణం చేపడుతున్నట్టు గ్రామ సర్పంచ్ తెలిపారు. ఈ పూజా కార్యక్రమానికి వారితో పాటు వైసిపి నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరులో బజాజ్ ఎలక్ట్రానిక్స్ షోరూమ్ ను ప్రారంభించడం అభినందనీయమని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని సంగం థియేటర్ కూడలిలో నూతనంగా ఏర్పాటుచేసిన షోరూమ్ ను ఆయనతో పాటు వైసీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి కలిసి ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 24 షోరూమ్‌ల్లో గూడూరు షోరూమ్ ఒకటి కావడం సంతోషకరమని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన వివరించారు. ఈ ప్రారంభోత్సవంలో బజాజ్ కంపెనీ ఉపాధ్యక్షులు గిరిధర్ రావు,రీజనల్ మేనేజరు అశోక్ కుమార్, గూడూరు మేనేజరు తేజ పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో

అన్నదానం

ప్రజాశక్తి- కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాదుకు నగరానికి చెందిన ఎస్‌వి.రమణారెడ్డి కుటుంబ సభ్యులు శనివారం శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

నేడు కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని మాజీ పార్లమెంట్ సభ్యులు చెంగల్రానాయుడు పార్కు వద్ద ఆదివారం తిరుపతి అరవింద్ కంటి వైద్య ఆసుపత్రి వారు మాజీ శాసనసభ్యులు వెంకటేశ్వర చౌదరి ఆధ్వర్యంలో కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు. కంటి సమస్యలున్న వారు కంటిపరీక్షలు చేసుకోవాలని కంటి చికిత్సకు అవసరమైన వైద్యంకు తిరుపతికి తీసుకెళ్లి ఆపరేషన్ చేసి తిరిగి బంగారుపాళ్యం వరకు ఉచితంగా రవాణా ఏర్పాటు చేయడం జరిగిందని అవసరమైన వారు ఈఅవకాశాన్ని సద్వినోదం చేసుకోవాలన్నారు.

రోడ్డుప్రమాదంలో ముగ్గరికి గాయాలు

ప్రజాశక్తి- గంగాధర నెల్లూరు: మండలం అప్పిరెడ్డి కండిగ గ్రామం వద్ద చిత్తూరు - పుత్తూరు జాతీయ రహదారి మెయిన్ రోడ్‌పై శనివారంలో కార్వేటి నగరం మండలానికి చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై చిత్తూరుకు వస్తుండగా, అదే సమయానికి అప్పిరెడ్డికండిగ గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై రోడ్‌పైకి రావడంతో ఎదురెదురుగా బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్ర గాయాలు , కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా ఐజేకే ఆవిర్భావ సభ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: భారత ప్రజాతంత్ర పార్టీ (ఐ జే కే) ఆవిర్భావ సభను శనివారం తిరుపతిలో నిర్వహించారు. స్థానిక తిరుచానూరు రోడ్ లోని ఎల్‌వి కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ పచ్చ ముత్తు, జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ అనంత మురుగన్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రస్తుతం అనేక రాజకీయ పార్టీలు ఉన్నాయని, వీటిలో అధిక భాగం డబ్బు సంపాదన కోసం ఏర్పడ్డాయని తెలిపారు. తమ పార్టీ ప్రజా సేవ కోసం నెలకొల్పామని, వ్యాపార ఇతరత్రా ద్వారా తాము సంపాదించిన సొమ్ములో కొంత భాగాన్ని ప్రజాసేవకు ఖర్చు చేసేందుకు పార్టీని నెలకొల్పామన్నారు కుల మత ప్రాంత భేదాలు లేకుండా, ధనిక పేద అభిప్రాయాలు లేకుండా సమ సమాజ స్థాపన కోసం తమ పార్టీ కృషి చేస్తుందన్నారు. తమ పార్టీ తమిళనాడు ఆంధ్ర లోనే కాకుండా దేశవ్యాప్తంగా విస్తరిస్తోందన్నారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో తమ పార్టీ ఆవిర్భావ సభను ఏర్పాటు చేసి, ఆంధ్రప్రదేశ్ తిరుపతి జిల్లా కమిటీలను ప్రకటించడం సంతోషదాయకమన్నారు. నిజమైన ప్రజాసేవకే అంకితమైన తమకు ప్రజలు మద్దతివ్వాలన్నారు. ప్రకాష్ గాంధీ, ఆముద, మదన్‌మోహన్, జగన్నాథం, నరేంద్రబాబు, లీలా, ఉష, ఓం ప్రకాష్ బాల, గీత, జమున, అరుణాచలం పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గురుపూజోత్సవం

గురుపూజోత్సవంలో మాట్లాడుతున్న సాహితీవేత్తలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : గురువు ప్రత్యక్ష దైవం అని ప్రముఖ సాహిత్యవేత్త చెన్న కేశవలు నాయుడు పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగుల భవనంలో పుత్తూరు అధ్యక్షులు భాస్కర్ రాజు ఆధ్వర్యంలో గురుపూజోత్సవం సంబరాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాహిత్య వేత్త , తెలుగు పండితులు పురుషోత్తం ఆచారి మాట్లాడుతూ అన్నీ వృత్తుల సృష్టి కర్త ఉపాధ్యాయుడు అన్నారు. పుత్తూరు విశ్రాంత ఉద్యోగుల నిరంతర సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. విశ్వ సాహిత్య సమైఖ్య తిరుపతి, అధ్యక్షులు అంకమ నాయుడు, అనంతరం భవన నిర్మాణానికి సహరించిన వేదవ్యాస విద్యా సంస్థల అధినేత, ఎస్‌వియు కార్యవర్గ కౌన్సిల్ సభ్యులు నారాయణ బాబును ఘనంగా సత్కరించారు. సీనియర్ విశ్రాంత గురువులు చంద్ర శేఖర్ రెడ్డి, వేణుగోపాల్, భక్తసీలన్, రాజగోపాల్ , నారాయణరాజు, నిర్మల, రామ చెంగారెడ్డి, సుకుమార్, లలితమ్మను, పుత్తూరు పరిసరాల్లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు 12 మందిని సంఘం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలసుబ్ర మణ్యం, మండల విద్యాధికారి , అధ్యక్షులు భాస్కర్ రాజు, గుణశేఖర్ రెడ్డి, రామలింగం, చంద్ర శేఖర్ వర్మ, రామమూర్తి, కృపవరమ్మ, కుప్పయ్య, మాలిని, మురళి, వెంకటకృష్ణ, రాజ్యలక్ష్మి, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. వడమాలపేటకు చెందిన లలితా భోజన వసతి కల్పించారు.

ఘనంగా తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -నాయుడుపేట: నాయుడుపేట ఏఎంసీ ఛైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి 73వ జన్మదిన వేడుకలు ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ముఖ్య అతిథిగా హాజరై వైసిపి నాయకులతో కలిసి ఆయనకి పూలమాలలు, శాలువాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఇలాంటి వేడుకలు ఎన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలకు నాయుడుపేట మండలం వైసిపి కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, నాయుడుపేట మున్సిపల్ ఛైర్ పర్సన్ కటకం దీపిక, నాయుడుపేట వైసిపి సీనియర్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వి శ్రీనివాసరావు, నాయుడుపేట ఎంపీపీ కురగొండ్ల ధనలక్ష్మి, తిరుపతి జిల్లా వైసీపీ కార్యదర్శి ఓట్టూరి కిషోర్ యాదవ్, మాజీ ఏఎంసి ఒట్టూరు రాధా కిషోర్ యాదవ్, నాయుడుపేట వైసిపి నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కటకం జయరామయ్య, పొట్లపూడి రాజేష్, నాయుడుపేట కౌన్సిలర్లు దార రవిబాబు,పాలేటి నాగార్జున, టిఎంఆర్ కాలేజ్ కరస్పాండెంట్ తంబిరెడ్డి మనోహర్ రెడ్డి, టిఎంఆర్ సంస్థల అధినేత తంబిరెడ్డి మోహన్ రెడ్డి వైసిపి కార్యకర్తలు, అభిమానులు, పట్టణ ప్రజలు పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.